క్లుప్తంగా

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



పటమట(విజయవాడతూర్పు): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం బెంజిసర్కిల్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ తూర్పు సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి రాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని, విజయవాడలో పని బంద్ చేసి వేలాదిగా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బెంజ్ సర్కిల్ కమిటీ కార్యదర్శి మాజేటి నాగ మల్లేశ్వరరావు, నాయకులు ఏడుకొండలు, అప్పారావు, రాజు దుర్గారావు, వి. రాంబాబు, అశ్విని కుమార్, నగర కమిటీ సభ్యులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):సత్యనారాయణపురంలోని రవీంద్రభారతి స్కూల్‌లో పేరెంట్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వారి అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో కలసి పాఠశాలలో సందడి చేశారు. విద్యాసంస్థ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ పాల్గొన్నారు. గ్రాండ్ పేరెంట్స్, కుటుంబ వ్యవస్థలపై విద్యార్థులకు బోధించారు. తాతామనుమలను శాలువాలతో సత్కరించి అభినందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రాండ్ పేరెంట్స్‌కు నిర్వహించిన ఆటల పోటీలలో తమ మనవళ్లతో పోటీపడుతూ వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు విద్యాసంస్థ చైర్మన్ బహుమతులను అందజేశారు.

నూతన కమిటీ నియామకం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం విస్తరణలో భాగంగా 36వ డివిజన్ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ప్రకటించారు. శనివారం గవర్నర్‌పేటలోని ప్రజా కాపునాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని ప్రకటించారు. ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం 36వ డివిజన్ అధ్యక్షుడిగా పులపా కిశోర్, ప్రధాన కార్యదర్శిగా యర్రంశెట్టి వెంకన్న, ఉపాధ్యక్షుడిగా దాసరి రాఘవ నియమితులయ్యారు. ఈ మేరకు అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నియామక పత్రాలు అందజేశారు. అంజిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కాపులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ముఖ్యంగా కాపు విద్యార్థులకు విదేశీ విద్య పథకం, పెళ్లి కానుక పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

200 మందికి వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ ముత్యాలంపాడులో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు గుండె, కంటి, ఎముకలు, కీళ్ల సమస్యలకు సంబంధించి 200మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తి రాజు, నవనీతం సాంబశివరావు, డి. మురళీ కృష్ణంరాజు, బెజ్జం సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెహమాన్ వీధి, శేషాద్రిశాస్త్రి వీధి, రామమందిరం రోడ్డు, వెంకటేశ్వరరావు వీధి, కోదండరామిరెడ్డి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, హుస్సేన్ సాహెబ్ వీధి, సంజీవయ్య కాలనీ, జానీ వీధి, జండా వీధి, రామ మందిరం వీధి, చింతావారి వీధి, దాసు వారి వీధి, మసీదు వీధి, జలీల్ వీధి, దుర్గయ్య వీధి, మొహిద్దీన్ వీధి, నంబూరువారి వీధి, అయ్యన్న నాయుడు వీధి, కోకా చలపతిరావు రోడ్డు, లిక్కిపుల్లయ్య వీధి, గార్లపాటివారి వీధి, రామస్వామి వీధులలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

శ్యామలాంబదేవి ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్య కాలనీలోని శ్యామలాంబదేవి అమ్మవారి ఆలయం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ నాగసాయి, ఉపాధ్యక్షుడిగా గుర్రం స్వామి, ప్రధాన కార్యదర్శిగా వండాని అప్పలనాయుడు, కోశాధికారిగా ఉషాజ్యోతి, సంయుక్త కార్యదర్శిగా బి. రమణ, గోపి, ఈదుపల్లి సత్యనారాయణ, చోడిశెట్టి సాంబశివరావు, కరణం శ్రీరాములు ఎన్నికయ్యారు.

న్యూ ఆర్ఆర్ పేటకు ఏమైంది?



మంచినీటి కుళాయి ప్రాంతం ఇలా..



అపార్ట్‌మెంట్‌ల వెనుక కలెక్టర్ లక్ష్మీశ వస్తుండగా అక్కడే సంచరిస్తున్న పందులు

- డయేరియా వ్యాప్తికి ఇంకా తెలియని కారణాలు
- ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యమంటూ పలు పార్టీలు, ప్రజల విమర్శలు
- నివాసాల మధ్యలో దుర్భర పరిస్థితులు
- కాపాడాలంటూ కలెక్టర్‌కు బాధితుల వినతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చంటి పిల్లలు, వృద్ధులని కాదు.. అన్ని వయస్సుల వారు డయేరియా బారిన పడి నీరసించిపోతున్నారు. వాంతులు, విరేచనాలతో వారం రోజుల నుంచి నరకయాతనను అనుభవిస్తున్నారు. తగ్గినట్లే తగ్గి మళ్లీ వ్యాపిస్తుండటంతో బాధితులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. అసలు న్యూ ఆర్ఆర్‌పేటకు ఏమైంది. ఈ డయేరియాకు కారణాలు ఏమై ఉంటాయి. ఈ బాధలు ఇంకా ఎంత కాలం... ఇంకా ఎన్ని రోజులు ఇలా అవస్థలు పడాలి..? ఇదీ ప్రస్తుతం విజయవాడలో డయేరియా భారిన పడిన 57వ డివిజన్ ప్రాంత ప్రజల మనోవేదన.

పెరుగుతున్న కేసులు

న్యూ రాజరాజేశ్వరీపేటలో డయేరియా వెలుగు చూసి నాలుగు రోజులు గడిచింది. రోజురోజుకు కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రజలు ఇంకా వైద్య శిబిరాలకు పరుగులు తీస్తూనే ఉన్నారు. సాక్షాత్తు మున్సిపల్ శాఖ మంత్రే అధికారికంగా 260కి పైగా డయేరియా కేసులు నమోదైనట్లు తెలిపితే.. ఇక ప్రైవేటు హాస్పటల్స్‌లో చేరిన వారి సంఖ్య కానీ.. ప్రభుత్వ లెక్కల్లో చూపించిన కేసులు కానీ దీనికి మూడు రెట్లు అధికంగానే ఉంటాయని పలు పార్టీల నాయకులు, స్థానిక పెద్దలు అంచనాలు వేస్తున్నారు. ఏ రోడ్డును కదిలించినా.. ఏ ఇంటికి వెళ్లి అడిగినా ప్రతి ఇంట్లో డయేరియా లక్షణాలతో బాధపడే వారు కనిపిస్తూనే ఉన్నారు.



మురుగు, చెత్తతో అధ్వాన పరిస్థితులు

నివాసాల మధ్య చర్యలు శూన్యం..

న్యూ రాజరాజేశ్వరీపేటలో డయేరియా సమస్య తలెత్తి నాలుగు రోజులు గడిచినా ఇంకా ఇక్కడి అపార్ట్‌మెంట్‌ల ప్రాంతాల్లో తీవ్ర దుర్భర పరిస్థితులు కనిపిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ మెడికల్ క్యాంపు పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు మినహా వాస్తవంగా నివాసాల మధ్య ఎటువంటి పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టడం లేదనే విషయాలు కలెక్టర్, వీఎంసీ కమిషనర్ సాక్షిగా తేటతెల్లమైంది. అపార్ట్‌మెంట్ల ప్రాంతాలలో శనివారం సాయంత్రం కలెక్టర్ లక్ష్మీశ, కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర పర్యటించారు. అక్కడ ప్రజలు పగిలిపోయిన డ్రెయినేజీ పైపులు, ఇళ్ల ముందే తిరుగుతున్న పందులు, మంచినీటి కుళాయిల చుట్టూ చెత్త, మురుగు పేరుకుపోయిన దృశ్యాలను వారికి ప్రత్యక్షంగా చూపించారు. మీరు వస్తున్నారు కాబట్టే రోడ్లు ఊడ్చి.. మురుగు తొలగిస్తూ అధికారులు హడావుడి చేస్తున్నారు తప్ప మేము ఎన్నిసార్లు మొత్తుకున్నా అస్సలు ఎవరూ పట్టించుకోవడం లేదని, మంచినీళ్లు అస్సలు బాగోడం లేదని, 50కు పైగా పందులు మా ఇళ్ల మధ్య సంచరిస్తున్నాయని, మా ప్రాణాలంటే అధికారులకు అసలు లెక్కే లేదని స్థానికులు వాపోయారు.

త్వరలోనే పరిష్కరిస్తాం

కలెక్టర్ పక్కనే ఉన్న కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్రకు పలు సూచనలు చేశారు. న్యూ ఆర్ఆర్‌పేటలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ ప్రజలకు చెప్పగా ఇంతకుముందు మా దగ్గరకు వచ్చిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు కూడా ఇలానే చెప్పారు తప్ప ఏమీ చేయలేదని చెప్పడంతో కలెక్టర్ తప్పకుండా మీ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతం కుళాయిల్లో నుంచి వచ్చే నీళ్లను తాగవద్దని, ఇంటింటికి ఇస్తున్న మినరల్ వాటర్‌ను సైతం కాచి చల్లార్చిన తరువాతనే తాగాలని స్థానిక ప్రజలకు కలెక్టర్ సూచించారు.

ప్రజల ఆరోగ్య రక్షణలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు
- డయేరియా బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ఆరోగ్యం కాపాడడంలో, ప్రాణనష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తంచేశారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా బాధితులను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఇసరపు దేవీతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి కేసుల తీరును అడిగి తెలుసుకుని బాధితులకు ధైర్యం చెప్పారు. అనంతరం విష్ణు మీడియాతో మాట్లాడుతూ న్యూ ఆర్ఆర్‌పేటలో డయేరియా విపత్తు వచ్చి నాలుగు రోజులు గడిచినా నేటికి దానికి కారణాలు ఏమిటో ఈ ప్రభుత్వం చెప్పకపోవడం దారుణమన్నారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం, అధికారులు కలిసి తప్పుడు సంకేతాలు ప్రజలకు ఇస్తున్నారని చెప్పారు. నరసింహ అనే వ్యక్తి కుటుంబం గత వారం రోజులుగా డయేరియా సమస్యలతో బాధపడుతున్నారని, వారందరూ హాస్పటల్ చుట్టూ తిరుగుతుండగా నరసింహ కూడా మూడు రోజుల నుంచి డయేరియాతో ఇంట్లోనే బాధపడుతుంటే అతన్ని గుర్తించి చికిత్స అందించాల్సిన ప్రభుత్వం ఆయన నిండు ప్రాణాలను బలికొందని మండిపడ్డారు. నరసింహకు మెడికల్ క్యాంపులోనే చికిత్స అందించి ఉంటే బతికేవాడని, ఆయన్ను ఇక్కడ ఉంచకుండా ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించడం వల్ల సకాలంలో వైద్యం అందక దారిలోనే చనిపోయాడని చెప్పారు. దీనిని కూడా ప్రభుత్వం కప్పిపుచ్చుకునేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, 300లకు పైగా కేసులు ఉన్న డయేరియా ప్రాంతంలో డోర్ టు డోర్ సర్వే ఇంకా ఎందుకు పూర్తి చేయలేకపోయారని నిలదీశారు. మాటికో మంత్రి వస్తే డయేరియా బాధితులకు ఏ ప్రయోజనం ఉండదని, వాస్తవాలను వెల్లడించి వారి కుటుంబాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ నిజనిర్ధారణ కమిటీ రాక

డయేరియా బాధితులకు అండగా నిలబడేందుకు వైఎస్సార్ సీపీ చర్యలు తీసుకుంటోందని మల్లాది విష్ణు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావు, డాక్టర్ సుధీర్, భార్గవరెడ్డి తదితరులతో కూడిన నిజనిర్ధారణ కమిటీ ఆదివారం డయేరియా ప్రాంతాల్లో పర్యటించి బాధితులను, ప్రజలను పరామర్శిస్తారని చెప్పారు. వాస్తవాలను తెలుసుకున్న తరువాత పార్టీ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. డయేరియాతో చనిపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ల్యాబ్ రిపోర్టు ఏదీ?: మేయర్

డయేరియాకు కారణాలేంటో 48 గంటల్లో ల్యాబ్ రిపోర్ట్ వచ్చాక చెబుతామని చెప్పి నాలుగు రోజులైనా ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ రిపోర్ట్‌ను ఎందుకు బయట పెట్టలేదని, అసలు ల్యాబ్ రిపోర్ట్ రాలేదా, రానివ్వలేదా అని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. డయేరియాతో నరసింహ అనే వ్యక్తి మృతిచెందగా మద్యం సేవించి చనిపోయాడని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డయేరియా ప్రాంతంలో బడ్డీ కొట్లతో సహా అన్ని మూసేసినప్పుడు మరి బార్‌లు ఎందుకు మూయలేదని నిలదీశారు. నరసింహ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఇసరపు రాజు, పఠాన్ నజీర్‌ఖాన్, ఆదినారాయణ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నవలా సాహిత్యంలో యద్దనపూడిది స్వర్ణయుగం



మాట్లాడుతున్న పాపినేని శివశంకర్

విజయవాడ కల్చరల్: నవలా సాహిత్యంలో యద్దనపూడి సులోచనారాణిది స్వర్ణ యుగమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. బొమ్మిడాల బ్రదర్స్ సహకారంతో సాహితీ ప్రచురణలు ఆధ్వర్యంలో విఖ్యాత కాలమిస్ట్ నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన పరిచయ కార్యక్రమం విజయవాడ బుక్ ఫెస్టివల్ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ సులోచనా రాణి ప్రవేశంతో నవలా సాహిత్యం రూపు రేఖలు మారిపోయాయన్నారు. తెలుగు పాఠకులు ఆమె నవలలకు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. సులోచనా రాణి సాహిత్య వివేచన రచయిత నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ సులోచనా రాణి నవలలు రాయడమే కాకుండా తెలుగు సినిమాలకు కథలను అందించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. విమర్శలను సైతం ఆమె స్వీకరించేవారన్నారు. కవి బండ్ల మాధవరావు సభను సమన్వయం చేశారు. రచయిత్రి మందరపు హైమావతి సులోచనా రాణి నవలా సాహిత్యం అంశంగా మాట్లాడారు. సాహితీ ప్రచురణకర్త లక్ష్మి, నగరానికి చెందిన పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

పల్లపు ప్రాంతాలు జలమయం



విజయవాడ నగరంలో కురుస్తున్న వర్షం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో శనివారం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ట్రాఫిక్ జాం అయి వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. శివారు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నీరంతా రోడ్లపైకి చేరి నగరవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ప్రధానంగా వన్‌టౌన్, అజిత్‌సింగ్ నగర్, భవానీపురం, పాయకాపురం, రాజీవ్‌నగర్ కండ్రిక, వాంబే కాలనీ, పటమట, గుణదల, ఆర్టీసీ కాలనీ, న్యూ పోస్టల్ కాలనీ, దర్శిపేటలో రోడ్లపైకి నీరు చేసి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వీఎంసీ మాన్సూన్ క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో రోడ్లపైకి చేరిన నీటిని తోడేసిన ప్పటికీ కరెన్సీ నగర్, మహానాడు రోడ్డు, హెచ్‌టీ లైన్ రోడ్డు, ఎంజీ రోడ్డు, బెంజి సర్కిల్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డు, మొగల్రాజపురం, గుణదల ఈఎస్ఐ ప్రాంతాల్లో నీరంతా రోడ్లపైకి చేరుకుని రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగింది. రోడ్లపైకి వర్షం నీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) నీరు చేరుకోవడంతో పలు వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి.

డయేరియా బాధితులపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

బ్లడ్ టెస్ట్‌లకు వన్‌టౌన్ వెళ్లమంటున్న వైనం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డయేరియా నేపథ్యంలో న్యూ ఆర్ఆర్‌పేట కేర్ అండ్ షేర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులో రోగులకు సరైన వైద్య సేవలను అందించలేకపోతున్నారు. బ్లడ్ టెస్ట్‌లు చేయమన్నా కూడా మేము ఇక్కడ చేయము.. వన్‌టౌన్ వెళ్లి చేయించుకోండంటూ క్యాంప్‌లోని వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ డయేరియా బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

బాధితులకు బాసటగా వైఎస్సార్ సీపీ

న్యూఆర్ఆర్‌పేటకు చెందిన బుట్టా నాగలక్ష్మీ అనే మహిళ రెండు రోజుల నుంచి జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతుంది. ఎంతకు జ్వరం తగ్గకపోవడంతో శనివారం సాయంత్రం ప్రభుత్వం ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపుకు వచ్చి తనకు బ్లడ్ టెస్ట్ చేయాలని కోరగా అక్కడి సిబ్బంది మేము ఇక్కడ ఏ బ్లడ్ టెస్ట్‌లు చేయడం లేదు.. మీరు కావాలంటే వన్‌టౌన్ వెళ్లి చేయించుకోమంటూ దురుసుగా సమాధానం చెప్పారు. ఈ విషయాన్ని ఆ మహిళ అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్ ఇసరపు దేవిల దృష్టికి తీసుకురాగా వారు వెళ్లి సిబ్బందిని బ్లడ్ టెస్ట్‌ల కోసం అడిగితే మళ్లీ అదే విధంగా సమాధానం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోమన్నారు. దీంతో వారు ఆగ్రహానికి గురై డయేరియా బాధితుల పట్ల మీరు ఇలాగేనా ప్రవర్తించేది.. అసలు ఏమి సేవలందిస్తున్నారంటూ విషయాన్ని ఆర్‌డీఓ కావూరి చైతన్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని దృష్టికి తీసుకువెళ్లారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మీకు ప్రజలకు వైద్య సేవలు అందించడం కష్టంగా ఉంటే.. సిబ్బంది కొరతగా ఉంటే మాకు చెప్పండి వైఎస్సార్‌సీపీ తరఫున మేము స్వచ్ఛందంగా ప్రజలకోసం వైద్య బృందాలను ఏర్పాటుచేసి సేవ చేస్తామని తెలిపారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్, ఇతర అధికారులు వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడి అటువంటివి పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

అతిసారపై అవగాహన కల్పించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



మైకు ద్వారా ప్రచారం చేస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వ్యాప్తి చెందిన అతిసార నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. శనివారం ఉదయం వివిధ శాఖాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలందరికీ అతిసార నివారణపై అవగాహన కల్పించాలని, ఇంటింటికి వెళ్లి కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులు, నీరసం ఉంటే నిర్లక్ష్యం చేయకూడదని, దగ్గరలోని ప్రథమ చికిత్సా కేంద్రంలో సంప్రదించేలా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అతిసార నివారణకు శుభ్రమైన కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని, నీరు నిల్వ ఉండకూడదని, వాడుకునే మంచినీటికి మూతలు తప్పనిసరిగా పెట్టాలని, ఇంటి పైనున్న ట్యాంకును క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకు శుభ్రం చేసుకోవాలని, ట్యాంకుపై తప్పనిసరిగా మూతను ఉంచాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం ఇంట్లో ఉంచుకోవాలని, పసి పిల్లలు ఉంటే వారికి తల్లి పాలను కొనసాగించవచ్చని చెప్పారు. కలుషిత నీరు, బయట వండిన అశుభ్ర ఆహారం తినకూడదని, విరేచనాలు వచ్చినప్పుడు కాఫీ, టీ, పానీయాలు తాగకూడదని, మలమూత్ర విసర్జన బహిరంగ ప్రదేశాల్లో చేయకూడదని చెప్పారు. నగర పౌరులకు దీనిపై ఎలాంటి సందేహాలు ఉన్నా సమాచారం, సహాయం కోసం ఎన్టీఆర్ జిల్లా కంట్రోల్ రూమ్ సెల్: 91549 70454 నంబరును సంప్రదించాలన్నారు. ఈ మేరకు వీఎంసీ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అతిసార నివారణపై అవగాహన కల్పించే కరపత్రాలు అందించి, మైకు ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.

అంబేడ్కర్ ఆలయ నిర్మాణ ప్రతిపాదనకు మద్దతు తెలపాలి

అంబేడ్కర్ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రవి ప్రకాష్



మాట్లాడుతున్న ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రవి ప్రకాష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలయ నిర్మాణం చేపట్టాలని 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మల కుమారి కౌన్సిల్‌లో ప్రతిపాదన చేయడంపై ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రవిప్రకాష్ హర్షం వ్యక్తంచేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశారని చెప్పారు. ముఖ్యంగా సమాజంలో సమాన హక్కులు, స్వేచ్ఛ, విద్యా అవకాశాలు కల్పించడంలో ఆయన పోషించిన పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. అంబేడ్కర్ కృషి వల్లే సమాజంలో వెనుకబడిన వర్గాలు, ముఖ్యంగా మహిళలు సమాన హక్కులు పొందగలిగారని చెప్పారు. అందుకే ఆయనను ప్రజలు దేవునిలా ఆరాధిస్తున్నారన్నారు. ఈ నెల 16న జరుగనున్న కౌన్సిల్ సమావేశంలో ఆలయ నిర్మాణ ప్రతిపాదనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సంపూర్ణ మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాజం మొత్తం కలిసికట్టుగా ముందుకు వచ్చి అంబేడ్కర్ ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సుమమాల సేవా సంస్థ అధ్యక్షుడు జాన్ రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు గుండె సుందర్‌పాల్, రాష్ట్ర యాదవ మహాసభ జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్, అంబటి వెంకటేశ్వరరావు, కొసనం కోటేశ్వరరావు, మస్తాన్, అలంకార్ బాబు, శ్రీను శేఖర్‌బాబు, పండు, సతీష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీ ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు తెల్లవారుజాము 4 గంటలకు అమ్మవారికి విశేషంగా అభిషేకం, అలంకరణ జరుగుతాయన్నారు. అమ్మవారు రోజుకొక అలంకారంలో పూజలు అందుకుంటారని చెప్పారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు జరుగుతాయని వివరించారు.

బాధితులకు నష్ట పరిహారం అందించాలి: సీపీఎం



బాధితులను పరామర్శిస్తున్న బాబూరావు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కారణంగా ముగ్గురు మృతిచెందగా.. 500 మందికి పైగా హాస్పటల్ పాలయ్యారని.. డయేరియా కారణాలను ప్రభుత్వం వెంటనే నిర్ధారించి.. దీనికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. డయేరియాతో శుక్రవారం మృతిచెందిన నరసింహ కుటుంబాన్ని, న్యూఆర్ఆర్‌పేటలోని డయేరియా బాధితులను సీపీఎం నాయకులతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ చుట్టపు చూపుగా మంత్రులు వచ్చి వెళ్తున్నారు తప్ప ప్రజలకు ఇప్పటికీ సరైన వైద్య సదుపాయాలు అందించడం లేదని ఆరోపించారు. మంత్రి నారాయణ, జాయింట్ కలెక్టర్‌లతో మాట్లాడి డయేరియా కారణాలను వివరించారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. సమైక్య భారతి, ఆంధ్రప్రదేశ్ తెలుగు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం భాషా సదస్సు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సమన్వయకర్త పి. కన్నయ్య మాట్లాడా రు. బోడి ఆంజనేయరాజు, కె. డేవిడ్‌రాజు, స్వా తి, శ్యాంప్రసాద్ చి త్ర గీతాలు ఆలపించా రు.

తల్లి, చెల్లి అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): మూడు రోజులుగా ఇద్దరు మహిళలు కనిపించడం లేదని నున్న పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు రామకృష్ణ తన చెల్లిని కాపురానికి పంపడం లేదని తల్లిని మందలించాడు. అదే రోజు ఈ నెల 10న మధ్యాహ్నం ఆస్పత్రికి వెళ్లి వస్తామని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లి, చెల్లి తిరిగి రాలేదు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేశారు.